క్లుప్తంగా

యాదవులు ఐకమత్యంతో మెలగాలి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న యాదవ ఉద్యోగ సంఘ నాయకులు

గిద్దలూరు రూరల్: యాదవులు ఐకమత్యంలో మెలగాలని నగర పంచాయతీ చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య అన్నారు. యాదవ ఉద్యోగుల, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం వారి ఆధ్వర్యంలో పట్టణంలోని వితాసుబ్బరత్నం కల్యాణ మండపం ఆదివారం క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో మాట్లాడారు. యాదవులు కలిసికట్టుగా ప్రతి విషయంలో ముందుకు సాగాలన్నారు. గౌరవ అధ్యక్షుడు డా.బి.వి.రంగారావు యాదవ కమ్యునిటీ హాలు ఏర్పాటుకు ప్రతి ఒక్కరూ కలిసి ప్రయత్నించాలన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు చల్లా రవికాంత్‌యాదవ్, జనరల్ సెక్రటరీ మొర్రి పిచ్చయ్య యాదవ్, కె.పోలయ్యాయాదవ్, తదితరులు

ప్రైవేటు ఏటీఎం నగదు డ్రాలో తగ్గుదల

పొదిలి: ప్రైవేటు ఏటీఎంలో డ్రా చేసినంత మొత్తం రాలేదని బాధితుడు ఎస్.శ్రీనివాసరెడ్డి ఆదివారం తెలిపారు. విశ్వనాథపురంలోని పెట్రోల్ బంకు వద్ద ఉన్న ఏటీఎంలో రూ.2వేలు డ్రా చేయగా, రూ.500, రూ.200, రూ.100 నోట్లు రెండు ప్రకారం మొత్తం రూ.1600 మాత్రమే వచ్చాయని తెలిపారు. ఇలా ఎందుకు జరిగిందో సంబంధిత అధికారులు పరిశీలించిన చర్యలు తీసుకోవాలని కోరారు.

నలుగురు జూదరుల అరెస్టు

లింగసముద్రం: పేకాట స్థావరంపై దాడి చేసి నలుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్సై ఆవుల వెంకటేశ్వర్లు చెప్పారు. పెదపవని గ్రామ పొలాల్లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం తెలియడంతో సిబ్బందితో వెళ్లి పేకాట స్థావరంపై దాడి చేసి నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.2100 స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఆలయ పునఃనిర్మాణానికి రూ.10,116 విరాళం

కందుకూరు అర్బన్: అంకమ్మ తల్లి ఆలయ పునఃనిర్మాణానికి పట్టణానికి చెందిన శ్రీరామ ఆజయ్‌కుమార్ ధర్మపత్ని సుజాత రూ.10,116 వేల విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులు సూరం వేణుగోపాల్‌రెడ్డి, ఆవుల మాధవరావులకు అందచేశారు.ఆలయ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని కమిటీ సభ్యులు తెలిపారు.

బ్రాహ్మణుల అభ్యున్నతికి కృషి

కందుకూరు అర్బన్: బ్రాహ్మణుల అభ్యున్నతికి కృషి చేస్తానని ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి అన్నారు. స్కంధపురి బ్రాహ్మణ సేవా సమితి నూతన కార్యవర్గం ఆదివారం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు ఇప్పగుంట నాగరాజరావు ఉపాధ్యక్షులు దీక్షతులు, సహాయ కార్యదర్శి నాగరాజు, కోశాధికారి మోహన్, కార్యవర్గ సభ్యులు సురేష్, శ్రీనివాస రావు, శేషగిరిరావు, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

మహిళకు వినికిడి యంత్రం అందజేత

టంగుటూరు: మండలంలోని బుచ్చిరాజుపాలెం కాలనీకి చెందిన పారబత్తిన సుగుణమ్మకు ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ చింతపల్లి హరిబాబు ఆదివారం వినికిడి యంత్రం అందజేశారు. ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబుకు ఆమె సమస్యను స్థానిక నాయకులు తెలియజేశారు. దీంతో పార్టీ నేతలు జిల్లా అధికారులతో మాట్లాడి వినికిడి యంత్రం మంజూరు చేయించారు. కార్యక్రమంలో మన్నం వెంకయ్య, ఎంపీటీసీలు బొడ్డు వాసంతి, కొమ్ము ప్రభుదాసు, దాసరి సుబ్బారావు, జిల్లా వికలాంగుల యూనియన్ పసుమర్తి రాజేష్, బొడ్డు రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

10న టీఆర్ఆర్ కళాశాలలో ముగ్గుల పోటీలు

కందుకూరు రూరల్: పట్టణంలోని టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 10వ తేదీ ఉదయం 10గంటలకు నెల్లూరుకు చెందిన చిన్మయమిషన్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రవికుమార్ తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేస్తామన్నారు. పూర్తి వివరాలకు 9000861863 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

74 మందికి వైద్య పరీక్షలు

గుడ్లూరు: ఇంటింటా వైద్యం-ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం అమ్మవారిపాలెం, అడవిరాజుపాలెం గ్రామాల్లో రోగులను పరీక్షించారు. వైద్యాధికారి మారుతీరావు రెండు గ్రామాల్లో 74 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందచేశారు. గర్భవతులు, బాలింతలకు కూడా పరీక్షలు నిర్వహించి ఆరోగ్య సలహాలు అందచేశారు.

చలి పులి.. ఎప్పుడు తగ్గుతుందో మరి!



ఉదయం 8 గంటల వేళ మంచు



చలి కాగుతున్న ప్రజలు

కొనకనమిట్ల: మండలంలో రెండు రోజులుగా మంచుతో పాటు చలి ప్రభావం పెరుగింది. దీంతో చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 9, 10 గంటలు దాటినా వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వ్యసాయ సీజన్ కావటంతో గ్రామాల్లో పంట కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. కానీ మంచు వల్ల ఇబ్బందులు కలుగుతున్నాయి. ప్రజలు చలి మంటలు వేసుకుని సేద తీరుతున్నారు.

కోటా సత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



ప్రత్యేక అలంకరణలో కోటా సత్యమాంబదేవి



ప్రత్యేక అలంకారంలో చెన్నకేశవ స్వామి

బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్ల కోటా సత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లె గ్రామాల్లోని పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కోటా సత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారికి అర్చనలు, సహస్ర నామపూజలు, కుంకుమపూజలు, అఖండహారతి పూజలు చేశారు. అమ్మవారికి బోనాలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు.

భక్తి శ్రద్ధలతో అంకాలమ్మ బోనాల మహోత్సవం

గిద్దలూరు రూరల్: మండలంలోని కొత్తకోట గ్రామంలో గల అంకాలమ్మ ఆలయం పునః ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా ఆదివారం గ్రామ ప్రజలు భక్తి శ్రద్ధలతో బోనాల మహోత్సవాన్ని నిర్వహించారు. ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలను నిర్వహించారు. మహిళలు కలశాలతో ఊరేగింపుగా అమ్మవారి వద్దకు వెళ్లి పూజలను నిర్వహించారు.

గుంటి గంగా భవానికి ప్రత్యేక పూజలు

తాళ్లూరు: జిల్లాలో ప్రసిద్ధి చెందిన గుంటి గంగా భవాని అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. పూజారులు విజయలక్ష్మి, ప్రకాశరావు ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఆలయానికి రూ.3,246 ఆదాయం వచ్చినట్లు ఆర్ఏ శ్రీనివాసరావు తెలిపారు. సౌకర్యాలను ఆలయ చైర్మన్ కటకంశెట్టి శ్రీనివాసరావు, ఈవో భాస్కర్‌రెడ్డి, ఆలయ అధికారి శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

గోదా దేవికి సారె సమర్పణ

మార్కాపురం టౌన్: ధనుర్మాస ఉత్సవాలు వైష్ణవ ఆలయాల్లో జరుగుతున్నాయి. ఆదివారం శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో స్వామివారి మూల విరాట్‌కు పంచామృతాభిషేకాలతో పాటు పెరుమాళ్లకు అధ్యయనోత్సవం, అర్చన నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఈవో శ్రీనివాసరెడ్డి, చైర్మన్ కేశవరావు నిర్వహించారు. కంభం రోడ్డులోని శ్రీప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవాలయంలో గోదాదేవి ఆండాళ్ 24వ పాశురం సందర్భంగా అమ్మవారికి మహిళ భక్తులు సారె సమర్పించారు. రామానుజ జీయర్ స్వామివారి చిత్రపటాన్ని ఊరేగించారు. రామారావు, రమేష్ పాల్గొన్నారు.



అలంకరణలో అమ్మవారు



గోదా దేవికి సారె సమర్పిస్తున్న భక్తులు

జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం



పోటీలు ప్రారంభిస్తున్న సీఐ, ఎస్సై

కంభం: క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని సీఐ యం. రాజేష్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం ప్రారంభమైన జిల్లా స్థాయి టెన్నిస్‌బా క్రికెట్ టోర్నమెంట్‌ను సీఐ రాజేష్, ఎస్సై నాగమల్లేశ్వరరావు ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలతో విద్యార్థులు మానసికంగా ధృఢంగా ఉంటారన్నారు. క్రీడల్లో రాణిస్తే ఉన్నత చదువులు, ఉద్యోగాల్లో ప్రాధాన్యత లభిస్తుందన్నారు. నిర్వాహకులు అతిథులను పూలమాల, శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం రెండు మ్యాచ్‌లు నిర్వహించగా మధ్యాహ్నం జరిగిన మ్యాచ్ లో పెద్దనల్లకాల్వ జట్టుతో పోలీస్ జట్టు తలపడింది.

బాలకృష్ణమ్మ సేవలు మరువలేనివి



బాలకృష్ణమ్మకు నివాళులర్పిస్తున్న నాయకులు

దర్శి: ఉపాధ్యాయలోకపు ప్రాతఃస్మరణీయుడు మార్పు బాలకృష్ణమ్మ సేవలు మరువలేనివని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కేవీజీ కీర్తి అన్నారు. బాలకృష్ణమ్మ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం సంస్మరణ సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కీర్తి మాట్లాడుతూ పాతపింఛన్ విధాన్, పీఆర్సీలో మాస్టర్ స్కేల్ సాధించి పెట్టిన ఘనత బాలకృష్ణమ్మదేనని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు వీ బాలాజీ, జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు, దర్శి మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కే వెంకటేశ్వరరావు, బుర్రి శ్రీను, బిక్రమ్ నాగార్జున, రవీంద్రరావు, కే నాగరాజు, పీరు సాహెబ్, బాలకృష్ణారెడ్డి, సుధాకర్, రోశయ్య, అప్పన్న, వీరాంజనేయులు పాల్గొన్నారు.

జిల్లా ఇంజినీరింగ్ సహాయకుల సంఘ అధ్యక్షునిగా సూర్యతేజ



ఏకగ్రీవంగా ఎన్నికైన జిల్లా, డివిజన్ అధ్యక్షులు

పొదిలి: ఇంజినీరింగ్ సహాయకులు జిల్లా సంఘం సర్వసభ్య సమావేశం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆదివారం జరిగింది. సంఘం జిల్లా అధ్యక్షులుగా సూర్యతేజను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మార్కాపురం డివిజన్ అధ్యక్షునిగా రవితేజ, కనిగిరి డివిజన్ అధ్యక్షునిగా షారూఖ్, ఒంగోలు డివిజన్ అధ్యక్షునిగా రాజశేఖర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పొదిలి మండల ఇంజినీరింగ్ సహాయకులు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు.

ఆర్ఎంపీల సంఘం జిల్లా ఉపాధ్యక్షునిగా ఇమాంసా



ఇమాంసాను సన్మానిస్తున్న కార్యవర్గ సభ్యులు

పొదిలి: ఆర్ఎంపీల సంఘం జిల్లా సర్వసభ్య సమావేశం ఆదివారం సాయి బాలాజీ కల్యాణ మండపంలో జరిగింది. సంఘం జిల్లా ఉపాధ్యక్షులుగా పొదిలి పట్టణానికి చెందిన ఆర్ఎంపీలు, అమ్మ సేవా సంస్థ చైర్మన్ డాక్టర్ ఇమాంసా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆర్ఎంపీల సమస్యల పరిష్కారం కోసం తన వంతుగా కృషి చేస్తానని ఇమాంసా చెప్పారు. తనపై నమ్మకంతో ఎన్నుకున్న అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఇమాంసాను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. డాక్టర్ భాస్కర్, లక్ష్మినారాయణ, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

పుల్లలచెరువు: సంక్రాంతి పండగ సందర్భంగా గ్రామాల్లో కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై సుధాకర్ హెచ్చరించారు. సంక్రాంతి పండగను సంప్రదాయబద్ధంగా నిర్వహించుకోవాలి కానీ కోడి పందేలు వేయడం నేరమని స్పష్టం చేశారు. సరిహద్దు గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

నేడు పెద్దదోర్నాలలో మంత్రి సురేష్ పర్యటన

పెద్దదోర్నాల: రాష్ట్ర మున్సిపల్ శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ సోమవారం పెద్దదోర్నాలలో పర్యటిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గంటా రమణారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు శ్రీశైలం రోడ్డులోని హరిత హైవే రిసార్ట్స్‌లో నిర్వహించే మండల సచివాలయ కన్వీనర్ల సమావేశంలో పాల్గొంటారని పేర్కొన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు మండల కేంద్రంలోని 2వ సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.

ఘనంగా ధనుర్మాస పూజలు



పూజలు అందుకుంటున్న రాములోరు

పుల్లలచెరువు: ధనుర్మాసం సందర్భంగా ఆదివారం పుల్లలచెరువు రామాలయంలో భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. మూలవిరాట్లను ఆలయ పూజారులు ప్రత్యేకంగా పుష్పాలతో అలంకరించారు. పూజల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించారు.

గాండ్ల సంక్షేమ సంఘ క్యాలెండర్ ఆవిష్కరణ



ఆవిష్కరణలో నాయకులు, సభ్యులు

పొదిలి: గాండ్ల, తెలికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను రూపొందించారు. ఆదివారం స్థానిక ప్రయివేటు పాఠశాలలో సంఘం అధ్యక్షులు చిట్టెంశెట్టి వెంకట కృష్ణారావు, ప్రధాన కార్యదర్శి దాసరి గురుస్వామి ఆవిష్కరించారు. సంఘ నాయకులు బట్టు రామారావు, వరికుంట్ల వెంకటేశ్వర్లు, ఏరువ వెంకట రామయ్య, న్యాయవాది దుడ్డు హరిప్రసాద్, బూదాటి నిమ్మయ్య, సత్యనారాయణ, వరికుంట్ల హరిబాబు, శివయ్య, సిహెచ్.కోటేశ్వరి, వరికుంట్ల అంజమ్మ, దుడ్డు పద్మ, మాడిశెట్టి ఆదిలక్ష్మి, చిట్టెంశెట్టి భార్గవి, బట్టు లక్ష్మి, బూదాటి దివ్య, గుంటిక సరస్వతి పాల్గొన్నారు.

ఇమాంల వేతనాలు మంజూరు చేయాలి

గిద్దలూరు రూరల్: మసీదులల్లో పనిచేస్తున్న ఇమాం, మౌజాన్ల వేతనాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి వేతనాలను ప్రభుత్వం మంజూరు చేయాలని ముస్లిం లీగ్ పార్టీ అధ్యక్షుడు గుడిసె భాష అన్నారు. నగర పంచాయతీలోని చట్టిరెడ్డిపల్లె గ్రామంలోని మసీదులో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం ముస్లింల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

పెట్టుబడిని సద్వినియోగం చేయడమే లక్ష్యం

- ప్రముఖ షేర్స్, చిట్‌ఫండ్స్ ఎనలిస్ట్ జె.వేణుగోపాల్



మాట్లాడుతున్న షేర్స్, చిట్‌ఫండ్స్ ఎనలిస్ట్ వేణుగోపాల్

సింగరాయకొండ: ఉద్యోగులు, వ్యాపారులు తమ వద్ద ఉన్న సొమ్మును షేర్స్, చిట్‌ఫండ్స్‌లో పెట్టుబడి పెట్టి ఆర్థికంగా ఎదగడమే లక్ష్యంగా పెట్టుబడిదారుల అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని ప్రముఖ షేర్స్, చిట్‌ఫండ్స్ ఎనలిస్ట్, జెన్ మనీ జనరల్ మేనేజర్ జె.వేణుగోపాల్ పేర్కొన్నారు. స్థానిక గంజి కళ్యాణ మండపంలో ఆదివారం మిరాయ్ ఎసెట్ మ్యూచ్యువల్ ఫండ్, జెన్ మనీ కంపెనీ బ్రాంచ్ నిర్వాహకులు కాకుమాని రవిచంద్ర, మందలపు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్టుబడిదారుల అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎనలిస్ట్ వేణుగోపాల్ మాట్లాడుతూ.. ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల కారణంగా ముందు జాగ్రత్తగా ప్రతి వ్యక్తి జీవిత బీమా, ప్రమాద బీమా, ఆరోగ్య బీమా తప్పక చేసుకోవాలన్నారు. వ్యాపారం చేసే వ్యక్తులు, ఉద్యోగులు తమ వద్ద మిగులు ధనం ఉన్నప్పుడే ఆ మొత్తాలను అనుకూలమైన షేర్లలో, మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడి పెట్టి ఆర్థికంగా బలోపేతం కావడానికి సహకరిస్తున్నామన్నారు. ప్రజలు మోసపూరిత ప్రకటనల వల్ల తమ డబ్బు నష్టపోకుండా జాగ్రత్తలు తెలియజేస్తున్నామన్నారు. జెన్‌మనీ కంపెనీ ఉపాధ్యక్షుడు పెద్ది శ్రీనివాస్, మిరాయ్ ఎసెట్ మ్యూచువల్ ఫండ్ ఏరియా హెడ్ వాలా కృష్ణ చైతన్య, పలువురు ఉపాధ్యాయులు, ఉద్యోగులు, రైతులు, వ్యాపారులు పాల్గొన్నారు.

కదిరి బాబూరావు కళాశాల విద్యార్థుల ప్రతిభ



బహుమతులు అందుకుంటున్న విద్యార్థిని పావని

సీఎస్‌పురం: ఉద్యానవన కళాశాలల రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో కదిరి బాబూరావు ఉద్యానవన కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. పశ్చిమగోదావరి జిల్లా వెంకటరామన్న గూడెంలోని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో ఉద్యానవన కళాశాలల రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు శనివారం జరిగాయి. పోటీలలో శీలంవారిపల్లి కదిరి బాబూరావు ఉద్యానవన కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. కదిరి బాబూరావు ఉద్యానవన కళాశాలలో మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థిని జి.పావని 200 మీటర్ల పరుగుపందెంలో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించింది. హైజంప్‌లో బాలికల విభాగంలో ఎం లక్ష్మీప్రసన్న తృతీయస్థానం, బాలుర విభాగంలో విశ్వనాథరెడ్డి తృతీయస్థానంలో నిలిచి వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ జానకీరాం చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు. విజయం సాధించిన విద్యార్థులను కళాశాల సెక్రటరీ కదిరి పార్థసారధి, డీన్ వీరన్నగౌడ్ అభినందనలు తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గురువులతో కలిసి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

గుడ్లూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాలలో 1989-94 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళం ఆదివారం ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాలు, విదేశాల్లో ఉద్యోగాలు చేస్తున్న, స్వగ్రామాల్లో వివిధ రకాల వృత్తులు, వ్యవసాయం చేసుకుంటున్న 100 మంది పూర్వ విద్యార్థులు ఆనందోత్సాహాలతో పాల్గొని గత స్మృతులను నెమరువేసుకున్నారు. చదువుకుంటున్న రోజుల్లో వారు చేసిన అల్లరి, ఆటపాటలు తమ స్నేహితులతో కలిసి ఆనందంగా పంచుకున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న తమ చిన్ననాటి స్నేహితులు చేజర్ల ప్రసాద్‌కు రూ.20 వేలు, దాసరి రమణమ్మకు రూ.15 వేలు ఆర్థిక సహాయం చేసి వారి ఔదార్యాన్ని చాటుకున్నారు. ఉన్నత పాఠశాలకు కంప్యూటర్, ప్రింటర్ అందచేయాలని తీర్మానించుకున్నారు.

అపూర్వం.. ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

త్రిపురాంతకం: త్రిపురాంతకం జడ్పీ హైస్కూల్లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆహ్లాదకరమైన వాతావరణంలో కొనసాగింది. 1985-1986 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు కుటుంబ సమేతంగా ఆదివారం పాఠశాలలో కలుసుకుని యోగక్షేమాలు తెలుసుకున్నారు. పూర్వ విద్యార్థుల్లో ఒకరు డిప్యూటీ కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తుండగా, మరికొందరు చార్టర్డ్ అకౌంటెంట్లు, ఇంజనీర్లు, ఉపాధ్యాయులుగా, వ్యాపారులుగా రాణిస్తున్నారు. ఇంకొకరు జెడ్పీటీసీగా పనిచేస్తున్నారు. కుమారులు, కుమార్తెలు, మనవళ్లను స్నేహితులకు పరిచయం చేస్తూ ఆనందంగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన నాటి గురువులు జీవీ నారాయణ, టి.మల్లారెడ్డి, దిట్టకవి శ్రీనివాసరావు, వి.నాగయ్య, మన్నవ కోటయ్య, టి.సుబ్బమ్మను ఘనంగా సన్మానించారు. పాఠశాల హెచ్‌ఎం టి.రాజశేఖరరెడ్డి, జెడ్పీటీసీ మాకం జాన్‌పాల్, సర్పంచ్ పొన్న వెంకటలక్ష్మి, పీఎంసీ చైర్మన్ సీహెచ్ రామిరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

వెండి కిరీటం బహూకరణ

సీఎస్‌పురం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన భైరవకోన త్రిముఖ దుర్గాదేవి అమ్మవారికి ఆదివారం దాతలు వెండి కిరీటం బహూకరించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి నర్రా నారాయణరెడ్డి, ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ సిద్దురమణారెడ్డి తెలిపారు. వైఎస్సార్ కడప జిల్లా పొద్దుటూరు గ్రామానికి చెంది మైదుకూరు మున్సిపల్ కమీషనర్ గా ఉన్న దండే రాముడు కుటుంబ సమేతంగా ఆదివారం భైరవకోనకు విచ్చేశారు. అక్కడి జలపాతాన్ని సందర్శించి త్రిముఖ దుర్గాదేవి, భర్గలేశ్వర, నగరేశ్వర, కాలభైరవ ఆలయాలలో పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి రూ.80 వేల విలువైన కిరీటాన్ని అందజేశారు.